కథ

# ఆ తరమూ మారుతోంది

ఎం.వెంకటేశ్వరరావు

వేగంగా పరుగెడుతోంది. రెండంకెలు ఒకటవ్వటానికి ఇంకా పదిహేన్నిమిషాలుంది. అప్పటికే గాఢనిద్రపోతున్న వైదేహికి, ఫోను మోగుతున్న శబ్దం వినిపించేసరికి చప్పున మెళకువ వచ్చింది. హాల్లో ల్యాండ్‌లైన్ ఫోన్ రింగవుతోంది.

పక్కన పడుకున్న భర్తతో "ఏవండీ! ఫోన్ మోగుతున్నట్టుంది కాస్త చూడరూ!" అంది.

"... ..."

వైదేహి లేద్దామనుకునేంతలో... శబ్దం చేస్తున్న ఫోను నిశ్శబ్దమయ్యేసరికి 'హమ్మయ్య' అనుకుని నడుం వాల్చబోతుంటే... ఫోన్ మళ్లీ మోగసాగింది.

తప్పదన్నట్టు హాల్లోకెళ్లి ఫోనెత్తి "హలో!" అంది.

"అమ్మా! నేను ప్రవీణ్‌ని.. ఎలా ఉన్నావమ్మా! నాన్నెలా ఉన్నారు?" అవతలి వైపు నుండి కొడుకు గొంతు చాలా రోజుల తర్వాత వినిపించేసరికి కొండంత ఆనందం, కొంచెం తడబాటు, కాస్తంత ఉద్వేగం వెరసి అర్థరాత్రి వైదేహి కళ్లలో రెండు కన్నీటి బొట్లు...

"ఎన్నాళ్లయిందిరా ఫోన్ చేసి..." అంది గొంతు పెగల్చుకుని.

"బిజీ.. అమ్మా! అస్సలు తీరిక దొరకటం లేదు"

"ఓహో!" అంది కళ్లొత్తుకుంటూ నిర్లిప్తంగా.

"నాన్న సెల్ స్విచ్ఛాఫ్ చేసినట్టున్నారు.. చాలాసేపట్నుంచీ ట్రై చేస్తున్నాను.. బదుల్లేదు."

"నిద్రపోతున్నారు.. లేపనా?"

"వద్దులే.. ఇది విను. మా ఇద్దరికీ హైదరాబాద్‌కి ట్రాన్స్‌ఫర్లొచ్చాయమ్మా! వచ్చే సోమవారం నేను జాయినవ్వాలి. నేను ఆదివారం ఉదయం అక్కడికి వస్తున్నాను. తనని ఓ నెలాగి రిలీవ్ చేస్తామన్నారు. ఇవ్వాళ సాయంత్రమే తెలిసింది."

"అలాగా! చాలా సంతోషం నాన్నా!"

"నాన్నకి చెప్పమ్మా! ఉంటా!" అని కొడుకు ఫోన్ పెట్టేసరికి, వైదేహి మెల్లగా నడుస్తూ బెడ్రూం చేరేసరికి భర్త చక్రపాణి లేచి కూచుని మంచినీళ్లు తాగుతూ కనిపించాడు.

"మీ సెల్ స్విచ్ఛాఫ్ చేశారా?"

"లేదే.." అని మంచం పక్కన స్టూలు మీదున్న ఫోనందుకుని చూసి.

"స్విచ్ఛాఫ్ కాలేదు.. ఛార్జింగ్ అయిపోంది" అన్నాడు పక్కన పెడుతూ.

"ప్రవీణ్ ఫోన్ చేశాడు."

"ఏమిటిట?" అన్నాడు పడుకుంటూ.

"వాళ్లిద్దరికీ హైదరాబాద్ ట్రాన్స్‌ఫరయిందట.""

"అలాగా?! శుభం"

"శుభం ఏంటి శుభం"

"అవునోయ్.. కొడుకూ, కోడలూ, మనవడూ.. శుభం కాక మరేంటి?"

"మీ మాటల్లో వెటకారం గ్రహించలేననుకోకండి."

"వెటకారమా? నీతోనా? నాకెందుకోయ్.. ఈ వయసులో."

"అది కాదండీ! అక్కడ వాళ్లిద్దరూ ఉద్యోగాలకెళుతూ.. పసివాణ్ని క్రెచ్‌లో వదిలెళ్లటం, అక్కడ వాడేడ్వటం, వాణ్ని చూసి వీళ్లు బాధపడటం.. ఇహమీద వాళ్లకా చెర తప్పుతుంది" అంటున్న వైదేహి వైపు చక్రపాణి విచిత్రంగా చూశాడు. మరో పది నిమిషాల పాటు "ఉన్న రెండు బెడ్రూముల్లో కొడుకూ కోడలికి ఏ బెడ్రూం ఖాళీ చేసివ్వాలో, మనవడికి స్టాండుయ్యాల ఎక్కడెయ్యాలో, మనవడికి ఏ టైంలో ఏ ఆహారం పెట్టాల్నో... మురిపెంగా చెబుతున్న వైదేహి వైపు చిద్విలాసంగా చూశాడు.

"ఏవీ.. ఆ మంచి నీళ్లివ్వండి" అంది ఆవిలిస్తూ.

చల్లని మంచినీళ్లు తాగి, బాటిల్ పక్కన పెట్టి, పడుకున్నదన్న మాటేగానీ కంటిమీద కునుకు పట్టటం లేదు. ఇన్నాళ్లకి ఒక్కగానొక్క కొడుకు.. వచ్చి తమతో ఉండబోతున్నాడన్న ఆనందం వైదేహిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. భర్త మౌనంగా పడుకోబట్టి సరిపోయింది. లేకపోతే మళ్లీ లేచి కూచుని ముచ్చట్లు పెడదామనుకుంది.

చక్రపాణి కళ్లు మూసుకు పడుకున్నాడన్న మాటేగానీ.. తరుముతున్న ఆలోచనలు కళ్లమీదికొస్తున్న నిద్రని వెనక్కి నెట్టేస్తున్నాయి. కళ్లు తెరిచి భార్య వైపు చూశాడు. ఆమె పక్కకి తిరిగి పడుకుంది.

తల తిప్పి పైకి చూశాడు. చీకటిని ఛేదించాలని చిన్న బెడ్‌ల్యాంప్ నుండి వస్తున్న వెలుతురు చేస్తున్న ప్రయత్నాన్ని కళ్లు చూస్తుంటే, అప్పుడు అలుముకున్న నిశ్శబ్దాన్ని జయించాలని వాల్‌క్లాక్ చేస్తున్న చిన్న శబ్దాన్ని చెవులు రిక్కించి వింటున్నాయి. వాటి రెంటినీ తప్పించుకుని మనస్సు జ్ఞాపకాల దొంతరల పై పొరల్ని స్పృశించేసరికి కళ్లముందు కావాల్సిన దృశ్యం ప్రత్యక్షమయింది.

* * *

చక్రపాణి బ్యాంకులో అసిస్టెంటు మేనేజరు. కూతురు భావన ఎం.సి.ఎ. చదివి, ఉద్యోగంలో చేరిన ఆర్నెల్లకే పెళ్లి కుదరటం, ఆపై నెలలోనే పెళ్లి జరగటం, మరుసటి నెలలో భర్తతో అమెరికా వెళ్లటం.. చకచకా జరిగిపోయాయి.

"ఏవిటండీ ఇది.. నిన్న మొన్నటివరకూ చదువుల్తో సరిపోయింది. పెళ్లయిన అచ్చటా ముచ్చటా తీరకుండానే అమ్మాయి అమెరికా వెళ్లింది" అంటూ భర్త ముందు వైదేహి వాపోతుంటే...

ఇంజనీరింగ్ చదువుతున్న కొడుకు ప్రవీణ్, "అమ్మా! ఎప్పుడూ నిన్నంటి పెట్టుకుని ఉండే కోడల్ని తీసుకురా! అప్పుడు అక్కయ్య ఇక్కడ లేదనే లోటు తెలీదు" అనేవాడు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రవీణ్ ఎమ్మెన్సీ కంపెనీలో ఉద్యోగానికి సెలక్టవటం, పూణేలో పోస్టింగ్ రావటంతో వెళ్లిపోయాడు. నెలకి ఇరవై రెండువేల జీతం చూసేసరికి.. ఇన్నాళ్లూ అంటిపెట్టుకున్న కట్టుబాట్ల కట్లు తెంపుకుని, ఇన్నేళ్ల అమ్మానాన్నల శిక్షణ క్రమం తప్పి, విలాస జీవితానికి జీతం అక్షయపాత్ర అయింది.

ఊర్కోలేక వైదేహి ఎప్పుడైనా కొడుకుని జీతం గురించి అడిగితే.. తను కట్టే బట్టలకీ, తినే తిండికీ, ఉంటున్న ఇంటికీ వచ్చేది సరిపోతుందని చెప్పేవాడు. కొడుకు వైఖరి నచ్చక భర్తతో అంటే.. "చిన్నతనం లే..." అనేవాడు.

* * *

చాలా సంవత్సరాల తర్వాత ఇంటికొచ్చిన ఆప్తమిత్రుడు ఆదినారాయణని చూసి తెగ సంబరపడిపోయాడు చక్రపాణి. ఇద్దరూ ఒకప్పటి కోలీగ్స్. ఆదినారాయణ ప్రమోషన్ మీద నార్తిండియా వెళ్లాక ఈమధ్యే స్వరాష్ట్రానికొచ్చాడు. మాటల మధ్య ఆదినారాయణ రెండో కూతురు హిమజ గురించి, చక్రపాణి కొడుకు ప్రవీణ్ గురించి ప్రస్తావనొచ్చి.. పెళ్లిమాటలు దొర్లాయి. హిమజ బ్యాంకులో పన్జేస్తోందని చెప్పి, ఓ పర్యాయం ఇంటికి రమ్మని ఆహ్వానించెళ్లాడు ఆదినారాయణ.

మరుసటి వారంలో మంచిరోజు చూసుకుని ఆదినారాయణ ఇంటికెళ్లారు చక్రపాణి దంపతులు. సాంప్రదాయ బద్ధంగా ఉన్న హిమజని చూసి ముచ్చటపడి, "అమ్మాయి అచ్చు మన భావనలాగే ఉందండీ" అంది

భర్తతో వైదేహి. చక్రపాణీ అదే ఫీలవ్వటంతో, ప్రవీణ్ ఫోటోలు హిమజకి చూపించారు. ఆ మర్నాడు కొడుకుతో మాట్లాడి నెట్ ద్వారా హిమజ ఫోటోలు కొడుక్కి పంపారు.


పది రోజులు గడచినా.. హిమజ గురించి కొడుకు అభిప్రాయం తెలపకపోయేసరికి, వైదేహి రెండు మూడు సార్లు ఫోను చేసేసరికి, ఆఫీసులో బిజీగా ఉన్నానని, ఈ వారం వస్తున్నా, పై వారం వస్తున్నానని నెల రోజులు దాటేసి.. చివరికి తాను అంజలి అనే తన కొలీగ్‌ని ప్రేమిస్తున్నానని, పది రోజుల్లో తమ పెళ్లి పూణే చాముండేశ్వరి ఆలయంలో జరుగుతోందని, తనని మన్నించి పెళ్లికి తప్పక రావాలని, ట్రైను టిక్కెట్స్ కొరియర్‌లో పంపుతున్నానని, గుక్క తిప్పుకోకుండా చెప్పి, ఫోన్ పెట్టేసేసరికి, చక్రపాణి వైదేహిలకు దిమ్మ తిరిగినట్టయింది. వైదేహి లంఖణాలు చేసినట్టు డీలాపడిపోయి విలపిస్తుంటే, భార్యని సముదాయిస్తూ, కొడుకు మీది కోపాన్ని దిగమింగుకుంటూ, ఆదినారాయణకిచ్చిన మాట పోయినందుకు బాధని అణుచుకుంటూ, నిద్రలేని రాత్రులు గడిపాడు చక్రపాణి.

నాలుగు రోజుల తర్వాత ఆదినారాయణకి ఫోన్లో విషయం చెప్పేసరికి, ఆరోజు సాయంత్రమే ఇంటికి వచ్చిన ఆదినారాయణని చూసి, చేతులు పట్టుకుని క్షమించమనేసరికి "పాణీ! ఈ రోజుల్లో ఇవన్నీ సహజం. అయినా ప్రవీణ్ ఏం తప్పు చేశాడని మీరిద్దరూ ఇంత ఫీలవుతున్నారు. ఇష్టపడ్డ అమ్మాయిని ధైర్యంగా పెళ్లి చేసుకుంటున్నాడు" అని ఇద్దరికీ నచ్చజెప్పి, కొడుకు పెళ్లికి ఇద్దర్నీ పూణే పంపాడు.

పెళ్లిలో పరాయివాళ్లలా దూరంగా నిలబడి నాల్గు అక్షింతలేసి, ఆ రాత్రే తిరుగు ప్రయాణమయ్యారు.

కనీ పెంచిన మమకారం మరొకరి ప్రాపకంలోకి తమ ప్రమేయం లేకుండానే వెళ్లిపోయిందన్న బాధతో నెలరోజుల వరకూ కోలుకోలేకపోయింది. భర్త ఎంత నచ్చజెప్పినా ఆమెలో స్తబ్దత పోలేదు. అలవాటుగా అన్నీ జరిగిపోతూనే ఉన్నాయి.

శూన్యం అలికిన ఇంట్లో ఏ పండగా



తొంగిచూడదన్నట్టు, మామూలుగానే మూన్నెల్లకో, నాలుగు నెలలకో ఇంటికి వచ్చే ప్రవీణ్.. చెప్పాపెట్ట కుండా, మరుసటి నెలలో భార్యతో వచ్చేసరికి, వైదేహి ఆవేదన ఆవేశంలా మారి.. కొడుకు, కోడల్ని గుమ్మం లోనే నిలబెట్టి, 'వెళ్లిపొమ్మంటుంటే'.. చక్రపాణి భార్యని లోపలికి తీసుకెళ్లాడు. అంజలికి వాళ్లేం మాట్లాడుకుం టున్నారో... భాష అర్థం కాకపోయి, భావం అర్థం అయి నిశ్శబ్దంగా లోపలికొచ్చింది.

ఆవేశం తగ్గిన వైదేహి... కాస్సేపటికి మామూలై, కోడలితో ఏం మాట్లాడబోయినా... 'భాష' అడ్డుపడి దూరాన్ని దగ్గర చెయ్యలేకపోయింది. అంజలిని చూస్తు న్నకొద్దీ... ఆమె కళ్లకి చూపు కందనంత దూరంలో హిమజ నిలబడి 'అత్తయ్యా!' అని నోరారా పిలుస్తున్నట్ట నిపిస్తుంటే... కళ్లముందు నిలబడ్డ కోడలు 'మాజీ...ఆంటీ' అని పిలుస్తుంటే... తెలుగుదనం తెల్లబో యినట్టు విలవిల్లాడింది ఆ కాలంలో తెలుగు బి.ఎ. చది విన వైదేహి మనసు.

షడ్రసోపేతంగా కొడుకూ కోడలి కోసం వంట జేస్తే.. 'రోటీ, సబ్జీ' కావాలని అంజలి అమాయకంగా అడుగుతుంటే, వైదేహి విస్తుపోయింది.

కోడలితో ఏం మాట్లాడాలన్నా కొడుకు అనువాదం చెయ్యాల్సొచ్చేసరికి ఉండబట్టలేక "ఈ లక్షణంతో రేపు మా గొంతులో గుక్కెడు నీళ్లయినా పోస్తుందట్రా... నీ పెళ్లాం" అంది కొడుకుతో వైదేహి.

* * *

పెళ్లయిన పది నెలలకి కొడుకు పుట్టాడని, మనవణ్ని చూడటానికి రమ్మని ప్రవీణ్ ఫోన్లో చెప్పగానే... అసలు కంటే వడ్డీ ముద్దనిపించిందేమో, మనవణ్ని చూడటానికి తహతహలాడుతూ వైదేహి బయల్దేరడంతో.. చిద్విలా సంగా ఆమెని అనుసరించాడు చక్రపాణి.

"ఇద్దరు మనుషులకి ఇంత పెద్ద ఇల్లా?" అను కుంది వైదేహి కొడుకు కోడలు ఉంటున్న త్రిబుల్ బెడ్రూం ఫ్లాట్ చూసి.

లోపలికెళ్లాక గానీ తెలియలేదు.. కోడలి తల్లిదం డ్రులూ ఆ ఇంట్లోనే ఉండటం చూసి అవాక్కయ్యారు. వాళ్ల పద్ధతులు, వాళ్లొండి పెట్టే తిండీ తిన్లేక, ఆ రోజు రాత్రి వైదేహి వంట చేసేసరికి, ఆవురావురుమని తింటున్న కొడుకుని చూసిన... వైదేహి మనసులో వైఘై నది ఉప్పొంగినట్టయింది..

ఆ తర్వాత మళ్లీ ఇదుగో సంవత్సరానికి కొడుకు బదిలీ వార్త విని... ఉక్కిరిబిక్కిరవుతోంది.

ఇన్నేళ్లూ ఓ పక్క తల్లిదండ్రుల బాధ్యతలు, మరో పక్క పిల్లల చదువు సంధ్యల బాధ్యతలు నెరవేర్చేసరికి వయసు మీద బడుతోందని గుర్తు జేస్తూ ఫలితకేశాలూ, బి.పి, షుగర్లూ బోర్డరు లైన్లు దాటేశాయి.

ఇప్పుడు కొత్త బరువు బాధ్యతల కోసం వైదేహి ఉబ లాట పడటం చూస్తుంటే... బంధనాలు తెంచుకున్నా వీడని బంధాలు పంజరంలోనే పడి విలవిలలాడుతున్న ట్టనిపిస్తుంది...

పెళ్లయిన కొత్తల్లో ఎల్టీసీ మీద ఓసారి ఢిల్లీ, మరో సారి కన్యాకుమారి వెళ్లటం మినహా, మరే మధురోహలూ లేవు. బ్యాంకులో కొలీగ్స్ ఎల్టీసీ మీద "సిమ్లా వెళ్లాం, ఊటీ వెళ్లాం" అని గొప్పగా చెప్పుకుంటుంటే.. చక్రపా ణికి భార్య మాటలు జ్ఞప్తికొచ్చేవి.

"మనం బ్రతికుండగా మన దేశాన్ని కాదు గదా! కనీసం మన రాష్ట్రంలో ఉన్న ప్రదేశాలక్కూడా నన్ను తీసుకెళ్లేట్టు లేరు" అనేది. ఆమెకి విహార యాత్రలంటే అంత ఇష్టం మరి.

వైదేహి మాటల్లోనూ వాస్తవం ఉంది.

చిన్నప్పట్నుంచీ వింటున్న శ్రీరామనవమి ఘనంగా జరిగే పక్కనున్న భద్రాద్రి రాముణ్ని చూడగల్గామా? దేశ విదేశాల్నుంచి ఎంతోమంది వచ్చి కన్నుల పండుగగా తిలకించే ఏడుకొండలవాడి బ్రహ్మోత్సవాలకి వెళ్లగ ల్గామా?

అంతెందుకు... హైదరాబాద్లో ఉన్న ఐ.మాక్సులో ప్రాణం ఒప్పి ఓ సినిమా చూడగల్గామా?

జీవితం ఇన్నేళ్లూ గాడిలో తిరిగే గానుగెద్దులాగే సాగింది.

మధ్యతరగతిలో 'మధ్యంతరం' వాళ్లకే ఈ బరు వులూ, బాధ్యతలూ.. అటు కన్న తల్లిదండ్రుల్ని కడతేర్చ టంలోనూ, ఇటు కన్నపిల్లల్ని కృతకృత్యుల్ని చేయటం లోనూ మధ్య వారధుల్లా మారుతున్నారే తప్ప, వాళ్లేం కోల్పోతున్నారో గ్రహించలేకపోతున్నారు. అది తెలుసు కునేసరికి వార్ధక్యపు వడిలో వచ్చి వాలిపోతున్నారు.

వైదేహి దగ్గటం వినిపించేసరికి, చక్రపాణితో అప్ప టివరకూ తోడున్న కొడుకు తాలూకు జ్ఞాపకాలు వేగంగా వైదొలగిపోయాయి.

మంచం పక్కనున్న కిటికీ తెరిచాడు. చల్లగాలి



## అవును! అయితే...?

**దీపికా పదుకొనె తన బాయ్ఫ్రెండ్ రణబీ ర్తో విడిపోయిన తర్వాత ఏం గొడవ జరిగింది, ఏమైంది? అంటూ రకరకాల ప్రశ్నలు వేసినవాళ్లకి మౌనమే తన జవాబుగా చెబుతూ వచ్చింది. కానీ ఇటీవల ఓ సందర్భంలో ఓ ఆసామీ మాత్రం కాస్త గట్టిగా 'రణబీర్ నుంచి దూరమయ్యాక ఇప్పుడు ఎలా వుంది? సంతోషంగానే వున్నారా?' అంటూ ప్రశ్నించాట్ట. దీనికి దీపిక ఎప్పట్లా మౌనంగానే జవాబిస్తుందనుకున్నారంతా. కానీ 'అవును, నేను సంతోషంగానే వున్నాను' అని టక్కున చెప్పేసి అక్క డ్నుంచి చకచకా వెళ్లిపోయింది.**

రివ్వున వీచేసరికి, ఆలోచనలతో వేడెక్కిన మెదడుకు హాయి అనిపించింది. అలసిపోయిన కళ్లు రెప్పలు వాల్చగానే... ఆలస్యం చెయ్యకుండా నిద్ర ఆక్రమించుకుంది.

* * *

రెండ్రోజుల తర్వాత ప్రవీణ్ వచ్చాడు. కుశల ప్రశ్నలు, అల్పాహారాలు పూర్తయ్యాక, చక్రపాణి కొడుకుతో "ఆబిడ్స్" వరకూ వెళ్లొద్దాం రా!" అన్నాడు.

"వాడెందుకూ... మీరెళ్లొద్దురూ... బెడ్రూం ఖాళీ చేయాలి.. ఇల్లు సర్దాలి" అందుకుంది వైదేహి.

"అవన్నీ నింపాదిగా చేసుకోవచ్చు. మేమిద్దరం వెళ్లొస్తాం. నువ్వు త్వరగా వంట చెయ్యి."

"అమ్మా! నాకు బయట పనుంది. నాన్నతో వెళ్లొస్తా" అని తండ్రితో బయల్దేరాడు ప్రవీణ్.

ఇరవై నిమిషాల్లో తండ్రీ కొడుకులిద్దరూ ట్యాంక్ బండ్ చేరుకున్నారు. బైక్ పార్క్ చేసి...

"రా! ఇక్కడ. కాసేపు కూచుందాం" అన్నాడు చక్రపాణి... శ్రీశ్రీ విగ్రహం సమీపాన చెట్టు నీడన కూచుంటూ..

"చెప్పండి! నాన్నా! ఏమిటి సంగతులు?"

అంతలో ప్రవీణ్ సెల్‌ఫోన్ మ్రోగింది. నెంబరు చూసి "హలో! అంజలీ!... బోలో" అంటూ భార్యతో పది నిమిషాలు మాట్లాడి, తండ్రి వైపు తిరిగి..

"అంజలి నాన్నా! బాబిగాణ్ని క్రెచ్‌లో వదలి ఆఫీస్‌కెళ్తుంటే ఏడుస్తున్నాట్ట" అన్నాడు.

"సరే! నువ్వు చేరబోయే ఆఫీసెక్కడుంది?"

"హైటెక్ సిటీ దగ్గర"

"మరి మారేడ్‌పల్లి నుంచి రోజూ వెళ్లిరావటం దూరమవుతుందేమో!"

"దూరమే నాన్నా! ఇద్దరం ఓ గంట ముందు బయల్దేరితేనే గానీ టైముకి వెళ్లగలం. బాబిగాణ్ని అమ్మ చూసుకుంటుంది. మేం వచ్చేసరికి రాత్రి పదవుతుంది."

"అలా చూస్తానని మీ అమ్మ చెప్పిందా?"

"అదేమిటి నాన్నా! అమ్మ చెప్పటం ఏమిటి?" వినకూడనిది విన్నట్టున్నాడు ప్రవీణ్.

"ఇప్పుడు మీ అమ్మ వయసెంతో తెలుసా నీకు?"

"ఫిఫ్టీ ప్లస్సుండొచ్చు."

"మీ అమ్మ ఆరోగ్యం గురించి ఎప్పుడైనా అడిగావా?"

"అమ్మకేమైంది నాన్నా! ఆరోగ్యం సర్లేదా? నాతో ఎప్పుడూ చెప్పలేదేం?"

"తెల్సుకోవాల్సిన అవసరం, తీరికా నీకు లేవనుకుని చెప్పలేదేమో!"

"ఏమిటి నాన్నా! కొత్తగా మాట్లాడుతున్నారు?"

"కొత్త పరిస్థితులు ఎదురవుతున్నప్పుడు పాత పద్ధతుల్నే పట్టుకు వేలాడటం ఇష్టంలేక."

"అంటే...!?!"

"మీ అమ్మకి బి.పి, షుగరూ వచ్చాయి. నాకూ బి.పి. ఉంది. అందుకని నువ్వు నీ భార్యతో వచ్చి ఇంట్లో ఉండటం కంటే... మీ ఆఫీసులకి దగ్గర్లో ఇల్లు తీసుకుని ఉండటం మంచిదంటున్నాను."

"ఇంట్లో మమ్మల్ని ఉండొద్దంటున్నారా?"

"ఇంకా మేం ఈ బంధాల ఉచ్చులోనే కూరుకుపోయి, చచ్చిపోదల్చుకోవటం లేదు. మాకూ స్వేచ్ఛ కావాలి, విశ్రాంతి కావాలి. మారుతున్న కాలంతోబాటు మాకున్న చిన్న చిన్న కోర్కెల్ని కనీసం ఇప్పుడైనా తీర్చుకోవాలిగా! ఎందుకంటే నాకింకా సర్వీసు రెండేళ్లే ఉంది."

"మేం ఇంట్లో ఉంటే మీకు స్వేచ్ఛ ఉండదంటారా?"

"ఖచ్చితంగా...! నేను నిన్ను తప్పుబట్టడం లేదు. మీ జనరేషన్‌ని చూసి మేం ఎంతో నేర్చుకోవాల్సింది ఉందని అనుకుంటున్నాను."

మౌనంగా తండ్రినే చూస్తున్నాడు ప్రవీణ్.

"నిన్నే తీసుకో.. చదువుకున్నన్నాళ్లూ ఎన్ని కబుర్లు చెప్పేవాడివి? అరటి పండు ఒలిచి మీ అమ్మ చేతిలో పెట్టి, అరచేతిలో వైకుంఠం చూపించావు. మాటల్తోనే ముల్లోకాలూ తిప్పి చూపించావు. నీకు ఉద్యోగం వచ్చాక అవన్నీ నిజం చేస్తావని మీ అమ్మ కలలు కుంటుండేది. కానీ నీకు రెక్కలొచ్చేగ్గానీ... తెలియలేదా పిచ్చిదానికి.. నువ్వు చెప్పిన తీపి కబుర్లన్నీ, ముమ్ముందు మింగించబోయే చేదు మాత్రలపై పూసిన పంచదార పూతలని."

ప్రవీణ్ మొహం వివర్ణమైంది తండ్రి మాటలకి.

"మమకారం మీకేగానీ మాకులేదంటూ... జీవితంలో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు మీ అవసరం మాకు లేదంటూ పక్కకి నెట్టేస్తుంటే, అవసరాల కోసం ఆప్యాయతల్ని అక్కున చేర్చుకుంటూ, పబ్బం గడిస్తే చాలనుకునే పేగు బంధాల మధ్యే, ఇంకా ఇరుక్కుపోయి, మళ్లీ 'ఇరుకు' జీవితంలో కూరుకుపోదల్చుకోవటం లేదు. ఒక ఇంట్లో ఉన్నప్పుడు ఎంత వద్దనుకున్నా వచ్చీపోయే స్పర్థలతో అశాంతిగా సర్దుకుపోయే కంటే, ఎవరి మానాన వాళ్లుంటే, కనీసపు ఆప్యాయతలు కొన్నాళ్లైనా బ్రతికుంటాయి. ఇవాళ మమ్మల్ని కాదనుకుంటే... రేపు అవసానంలో ఎవరు చూస్తారంటావేమో!? కాలం మారింది. కాలంతో బాటు ఇంకా ఈ అనుబంధాలు, ఆప్యాయతల్ని పట్టుకు వ్రేలాడే రోజులూ అంతరించిపోతున్నాయి. మిమ్మల్ని చూసి మేమూ మార్పు తెచ్చుకోవాలి.

లోకం చాలా విశాలమైనది. ఒంట్లో ఓపిక ఉన్నంత వరకూ ఒకళ్లకొకళ్లం.. లేదంటే.. ఆర్థిక వెసులుబాటుంటే చాలు... ఆదరించే ఆశ్రమాలు ఎన్నో ఉన్నాయి.

పిల్లలపై మమకారం చంపుకోలేక వాళ్ల పంచనే పడుండి... ఛీ! ఛా! అన్పించుకుంటూ, అవసానంలో వృద్ధాశ్రమాలకి గెంటించుకునే కంటే... ఓపిక తగ్గిన నాడు మా అంతట మేమే ఆ ఆశ్రమాల్ని ఆశ్రయించటం గౌరవం, మర్యాద. బ్రతికున్న అమ్మానాన్నల్ని.. పిల్లలు ఎప్పుడైనా వచ్చి చూసెళ్తే చాలనుకుంటాం.

ఇదంతా నిన్నేదో కించపరచాలని చెప్తున్నాననుకోకు.. నీ భార్యా పిల్లల్ని చూసుకోవడం నీకెలాగూ తప్పదు. మీ అవసరాల కోసం ఇంకా మమ్మల్ని అవస్థల పాల్జేయొద్దంటున్నాను. మీకు లేని ఆప్యాయతల్ని, మేమింకా పట్టుకుని వ్రేలాడే ఓపిక లేదంటున్నాను.

రెప్ప వాల్చకుండా చూస్తున్న ప్రవీణ్ భుజంపై చెయ్యేసి,

"చూడు! ప్రాయం వచ్చిన కూతురికి పెళ్లిచేసి పంపితే బరువు, బాధ్యతలు తీరిపోతాయి. కానీ పాతికేళ్లొచ్చిన కొడుక్కి పెళ్లిచేస్తే.. బరువు దించుకున్నా బాధ్యతలు వెంబడిస్తున్నాయి. అందుకే... మేం మళ్లీ ఈ.. బాధ్యతల రొంపిలో దిగదల్చుకోలేదు. ఈ విషయాలు మీ అమ్మ ముందో, భార్య ముందో చర్చించటం సబబు గాదు. ఇంటి యజమానిగా నా నిర్ణయం నేను చెప్పాను. ఇప్పుడు నువ్వూ భార్యా పిల్లలున్న కుటుంబ యజమానివయ్యావు గాబట్టి, ఏం చేస్తే బాగుంటుందో, ఆలోచించి నిర్ణయం తీసుకోవడం నీ విజ్ఞతకే వదిలేస్తున్నాను" అని ముగించి.. లేచాడు చక్రపాణి.

* * *

మధ్యాహ్నం భోజనాలయ్యాక, "ప్రవీణ్ రారా! ఈ గది ఖాళీ చేద్దాం" అంటున్న తల్లితో..

"ఎందుకమ్మా! రోజూ ఇక్కణ్నుంచి హైటెక్ సిటీ వరకూ వెళ్లిరావటం కష్టం.. ఆఫీసుకి దగ్గర్లో ఇల్లు తీసుకుంటా!" అన్నాడు.

"అదేవిట్రా..! విడ్డూరం గాక పోతే... ఇద్దరూ ఉద్యోగాలకెళితే, పసివాణ్నెవరు చూస్తారు?"

"క్రెచ్‌లుంటాయి గదమ్మా" అన్నాడు ప్రవీణ్ సోఫాలో పడుకుంటూ.

"ఏమిటన్నట్టు?" భర్త వైపు చూసింది వైదేహి.

'తనకేమీ తెలీదన్నట్టు' పెదవి విరిచాడు చక్రపాణి గుంభనంగా.

○

